సీఎంతో సివిల్స్ విజేత



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుని వారి శుభాకాంక్షలు అందుకుంటున్న యూపీఎస్సీలో ఉత్తీర్ణత సాధించిన విద్యుత్ బోర్డు చైర్మన్ డాక్టర్ రాధాకృష్ణన్ తనయుడు డాక్టర్ అరవింద్

హాకీ స్టేడియంకు శంకుస్థాపన



కోయంబత్తూరులో రూ.9.67 కోట్లతో నిర్మించనున్న హాకీ స్టేడియం సహా పలు అభివృద్ధిపనులకు ఆదివారం శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

కోవైలో జల్లికట్టు సందడి



కోయంబత్తూరులో ఆదివారం జల్లికట్టు పోటీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి సెంథిల్ బాలాజీ

రోడ్డు ప్రమాదంలో చిన్నారి సహా
నలుగురి మృతి


పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి సమీపంలో రెండు కార్లు ఢీకొన్న ఘటనలో చిన్నారి సహా నలుగురు మృత్యువాతపడ్డారు. నాంగురేరి సమీపం దళపతి సముద్రం కీళూరు జాతీయ రహదారిలో ఆదివారం మధ్యాహ్నం వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, ఎదురు మార్గంలో వస్తున్న మరో కారును ఢీకొంది. ఈ ఘటనలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న చిన్నారి సహా నలుగురు మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ ఘటనలో గాయపడిన మరికొందరిని ఆసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.1,000 తగ్గిన ఎం-శాండ్, బి-శాండ్

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎం-శాండ్, బీ-శాండ్, కంకర తదితరాలపై పెంచిన ధరల్లో రూ.1,000 తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. క్వారీలు, క్రషర్లు, లారీ యజమానుల సంఘం ఈ నెల 25వ తేది అందజేసిన వినతిపత్రంలోని అంశాలు చర్చించేందుకు సచివాలయంలో ఆదివారం నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఆ ప్రకారం, క్వారీ, క్రషర్, లారీ యజమానుల సంఘం ఎం-శాండ్, బీ-శాండ్, గ్రావెల్ లోడింగ్ ధరను రూ.1,000 తగ్గించింది. అలాగే, సాధారణ రాళ్లకు సీనియరేజ్ ధర మెట్రిక్ టన్నుకు రూ.33 వేలుగా నిర్ణయించారు. ఈ మేరకు మరో వారం రోజుల్లో ప్రభుత్వం జీవో విడుదల చేయనుందని మంత్రి దురైమురుగన్ తెలిపారు. సమావేశంలో సహజ వనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి కె.ఫణీందర్ రెడ్డి, ఖనిజ, గనుల శాఖ కమిషనర్ ఎ.శరవణవేల్ రాజ్, క్వారీ, క్రషర్, లారీ యజమానుల సంఘం అధ్యక్షులు కె.చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

సముద్ర గర్భంలో
సహజవాయు నిక్షేపాలు

- నాలుగు చోట్ల తవ్వకాలకు కేంద్రం అనుమతి
- మండిపడుతున్న తీర ప్రాంతవాసులు



తవ్వకాలు జరుగనున్న ప్రాంతాలను తెలిపే మ్యాప్

అడయార్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సముద్ర గర్భంలో సహజవాయు నిక్షేపాలున్నట్టు గుర్తించగా, వీటిని వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగు చోట్ల అనుమతిచ్చింది. సముద్ర గర్భంలోని సహజవాయు నిక్షేపాలను గుర్తించి, వెలికి తీసేందుకు ఓఎన్‌జీసీకి కేంద్రం అనుమతులిచ్చింది. తమిళనాడుతో పాటు దేశవ్యాప్తంగా 28 జిల్లాల్లో ఈ తవ్వకాలకు పచ్చజెండా ఊపింది. కొన్ని నెలల క్రితం అనేక ప్రాంతాల్లో సముద్రగర్భంలోని సహజవాయు నిక్షేపాలపై పరిశోధన చేశారు. ఈ పరిశోధనలు జరిగే సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు తీర ప్రాంత వాసులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో కేంద్రం ఎలాంటి దూకుడు ప్రదర్శించకుండా ఊరుకుంది. ఇపుడు చడీచప్పుడు లేకుండా, రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో ఈ తవ్వకాలు చేపట్టేందుకు ఓఎన్జీసీకి కేంద్రం అనుమతిచ్చింది. ఈ తవ్వకాలకు వ్యతిరేకంగా తీర ప్రాంత వాసులు పలు రకాలైన ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. వీటన్నింటినీ బేఖాతర్ చేసిన కేంద్రం కన్నియాకుమారి సముద్ర గర్భంలో మూడు చోట్ల సహజవాయువు నిక్షేపాల కోసం తవ్వకాలు చేపట్టేందుకు అనుమతులిచ్చింది. ఇందులో గల్ఫ్ ఆఫ్ మన్నార్‌లో 9990.96 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కూడా ఇమిడి వుంది. ఈ తవ్వకాలకు త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. 2023 నవంబరులో రామనాథపురం జిల్లాలో హైడ్రో కార్బర్ పరిశోధనల కోసం ఓఎన్జీసీ అనుమతి కోరింది. అయితే, స్థానికులతో పాటు అన్ని రాజకీయ పార్టీల నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకున్నారు. ఇపుడు కన్నియాకుమారి సముద్రగర్భంలో సహజవాయు నిక్షేపాల కోసం ఓఎన్జీసీ తవ్వకాలు చేపట్టనుంది.

నడుకుప్పంలో
మన్‌కీ బాత్ ప్రసారయత్నం

- షామియానాలు, ఎలక్ట్రిక్ పరికరాల స్వాధీనం

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాబీచ్‌లో అవ్వయార్ విగ్రహం సమీపంలోని నడుకుప్పం వద్ద ఆదివారం ఉదయం పోలీసుల అనుమతి లేకుండా ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసే ప్రయత్నాలు జరిగాయి. షామియానాలు, ఎయిర్‌కూలర్లు, మైకులు, సౌండ్‌బాక్స్‌లతో నానా హడావుడి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మహిళా మోర్చా నాయకురాలు వానతి శీనివాసన్ పాల్గొంటారని ప్రకటించారు. ఆ ప్రాంతంలో బీజేపీ జాతీయ నాయకులు, రాష్ట్ర నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు కూడా కట్టారు. నడుకుప్పం ఎంఆర్‌టీఎస్ రైల్వే వంతెన దిగువన షామియానా వేశారు. పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం తెలియటంతో వారి ఆదేశాల మేరకు పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్ళారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు జరుపకూడదని మైక్‌లో ప్రకటన చేశారు. అయినా బీజేపీ కార్యకర్తలు అక్కడి నుండి వైదొలగలేదు. దీనితో పోలీసుల బలప్రయోగంతో వారిని అక్కడి నుండి తొలగించారు. ఆ తర్వాత షామియానాలను, ఎయిర్‌కూలర్లు, ఎలక్ట్రికల్ పరికరాలను స్వాధీనం చేసుకుని వ్యాన్లలో తరలించారు. ఈ విషయమై బీజేపీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి సతీష్‌కుమార్ మాట్లాడుతూ నడుకుప్పంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేని ప్రాంతం కనుకే ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రసారం చేయాలని నిర్ణయించామని, పోలీసులు ఉన్నట్టుండి ఆ ప్రాంతంలో అనుమతి లేకుండా సభ కార్యక్రమం చేస్తున్నారంటూ షామియానాలు, ఎలక్ట్రిక్ వస్తువులను తొలగించి నానా హడావుడి చేశారని ఆరోపించారు. అదే సమయంలో బీజేపీ నేతలు గంట లోపే అక్కడికి కిలోమీటర్ దూరంలో ఉన్న ఓ మండపంలో మన్‌కీ బాత్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా, ఆ కార్యక్రమానికి హాజరైన నగరవాసులకు మాంసాహార విందు కూడా ఏర్పాటు చేశారు.

స్వచ్ఛమైన పాలనే టీవీకే ప్రధాన లక్ష్యం

- కోవై సభలో విజయ్ • రెండో రోజు బూత్‌కమిటీ ఇన్‌ఛార్జులతో భేటీ
- రోడ్‌షోకూ అపూర్వ స్పందన

తమిళతల్లి ప్రార్థన ఆలపించిన బాలికలను అభినందిస్తున్న విజయ్



రోడ్ షోలో పాల్గొన్న విజయ్



చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తుందని, ప్రజలకు సిరువాణి వాగు నీరులా స్వచ్ఛమైన పాలన అందిస్తానని ఆ పార్టీ అధినేత విజయ్ అన్నారు. కోయంబత్తూరులోని ఓ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన బూత్‌కమిటీ ఇన్‌ఛార్జుల రెండో రోజు సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ రాజకీయ లబ్ధికోసం తాను పార్టీ ప్రారంభించలేదని, రాష్ట్రంలో తమ పార్టీ పాలనలోకి రాగానే అవినీతి ఉండదని, అవినీతి పరులంతా పత్తాలేకుండా పోతారన్నారు. పార్టీ బూత్ కమిటీ ఇన్‌ఛార్జులందరూ 'ప్రజల వద్దకు వెళ్లి, వారివద్దే అన్నీ నేర్చుకో, ప్రజలకోసమే జీవించు' అంటూ మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై చెప్పిన మాటను గుర్తుంచుకుని ప్రజలకోసమే పాటుపడాలని పిలుపునిచ్చారు. బూత్‌కమిటీ ఇన్‌ఛార్జులంతా ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవాలని, వారి సమస్యలను అడిగి తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.

కాబోయే సీఎం విజయ్...

ఈ సభలో ప్రసంగించిన టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ మాట్లాడుతూ 2026 ఎన్నికలలో పార్టీ శ్రేణులందరికి ఆశయం ఒక్కటేనని, విజయ్‌ని సీఎం పీఠంపై కూర్చోబెట్టడమే ప్రధాన కర్తవ్యమని చెప్పారు. ఏ సమయంలో ప్రజలను కలుసుకోవాలి, ఎప్పుడు ఏం మాట్లాడాలనే విషయాలపై విజయ్‌కి చక్కటి అవగాహన ఉందన్నారు. ఈ సమావేశానికి వ ంందు

విజయ్ కోయంబత్తూరు నగరంలో రోడ్‌షో నిర్వహించారు. ఇదిలా ఉండగా సమావేశం హాలు వద్ద అనుమతి లేకుండా ప్రవేశించేందుకు ప్రయత్నించిన పార్టీ శ్రేణులను పోలీసులు లాఠీలను ఝుళిపించి తరిమికొట్టారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులకు భయపడి సుమారు రెండు వందల మంది సభా వేదిక ప్రాంతం నుండి పరుగులు తీశారు.

పోరంబోకు స్థలాల్లో ఉన్న
80 వేల మందికి ఇళ్లపట్టాలు

అడయార్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి ఆక్షేపణ లేని (పోరంబోకు) స్థలాల్లో ఉన్న 80 వేల మందికి ఇళ్ళపట్టాలు అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.. ఈ మేరకు ఈ నెల 17వ తేదీ ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం రూపొందించిన విధి విధానాల మేరకు ఇళ్ళపట్టాలను అందజేయనుంది. చెన్నై చట్టుపక్కల ఉన్న నాలుగు జిల్లాల్లో 'బెల్ట్ ఏరియా'గా పిలవబడే 32 కిలోమీటర్ల పరిధిలో ప్రభుత్వ పోరంబోకు స్థలాలను ఆక్రమించుకుని సుదీర్ఘకాలంగా నివసిస్తున్న వారికి, ఇతర జిల్లాల్లో ఎలాంటి ఆక్షేపణ లేని స్థలాల్లో ఉండే వారికి పట్టాలివ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆ ప్రకారంగా ఒక్క చెన్నై జిల్లాలోనే 29,187 మందికి, ఇతర జిల్లాల్లో 57,084 మంది కలిపి మొత్తం 86 వేల మందికి ఆరు నెలల్లో పట్టాలు అందజేయనున్నారు. దీనికోసం కొన్ని విధి విధానాలు, అర్హతలను రెవెన్యూ శాఖ రూపొందించింది. ఈ విషయంపై మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కొన్ని పోరంబోకు స్థలాల్లో పదేళ్ళకుపైగా నివసిస్తున్న వారికి పట్టా ఇచ్చేందుకు వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచింది. వార్షిక ఆదాయం రూ.5 లక్షలు ఉన్న కుటుంబాలకు 3 సెంట్ల భూమి ఇస్తారు.ఇందులో 2సెంట్లకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.మిగిలిన సెంటుకు మాత్రం 25 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు పైగా రూ.12 లక్షల కింద ఉండే కుటుంబాల వారు రెండు సెంట్ల స్థలం మొత్తం విలువలో 50 శాతం, సెంట్ స్థలానికి 100 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వార్షిక ఆదాయం రూ.12 లక్షలకు పైగా ఉండే కుటుంబాల వారు 3 సెంట్ల స్థలానికి మొత్తం విలువ చెల్లించాల్సి ఉంటుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో పేర్కొంది.

రాష్ట్రంలో వీసా లేని
46వేల మంది
విదేశీయులు!

- హైకోర్టు జడ్జి దండపాణి షాకింగ్ ప్రకటన



ప్యారీస్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వీసా గడువు ముగిసిన తర్వాత కూడా పాకిస్థాన్, బంగ్లాదేశ్, మయన్మార్, ఆఫ్రికా తదితన దేశాలకు చెందిన 46వేల మంది విదేశీయులు నివసిస్తున్నారని మద్రాస్ హైకోర్టు జడ్జీ ఎం.దండపాణి ప్రకటన కలకలం రేపింది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 27 మంది బలయ్యారు. ఈ మారణకాండ అనంతరం ఐఎస్ఐ, అల్‌ఖైదా తదితర తీవ్రవాద సంస్థలకు సహకరిస్తున్న సంస్థలపై కన్నేసి, వాటి కదలికలను పర్యవేక్షిస్తుండటం, పాకిస్థానీయులను దేశం నుంచి వెల్లగొట్టడం వంటి చర్యలు, విచారణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాలకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయంపై కోయంబత్తూరులో జరిగిన ఓ కార్యక్రమంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి దండపాణి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అదుపుచేసేందుకు తీసుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రభుత్వానికి సూచనలిచ్చారు. అంతేకాకుండా రాష్ట్రంలో వీసా గడువు ముగిసిన తర్వాత కూడా పాకిస్థానీలు, బంగ్లాదేశీయులు, బర్మా, ఆఫ్రికన్లు సుమారు 46వేల మందికి పైగా చట్టవిరుద్ధంగా వున్నారని తెలిపారు. వీరిలో ఆఫ్రికన్లు, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలకు చెందిన సుమారు 20వేల మంది వీసాలు లేకుండానే చట్టవిరుద్ధంగా కోయంబత్తూరు, తిరుప్పూర్ జిల్లాల్లో నివసిస్తూ అక్కడున్న పరిశ్రమల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వీసా గడువు ముగిసిన తర్వాత రాష్ట్రాన్ని వదిలివెళ్ళని విదేశీయుల వల్ల పెనుముప్పు వాటిల్లే ప్రమాదముందని, అందువల్ల రాష్ట్రప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి వారిని వెల్లగొట్టే ప్రయత్నాలు చేపట్టాలని న్యాయమూర్తి దండపాణి తన ప్రసంగంలో పేర్కొన్నారు.

అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకుంటే
డిప్యూటీ సీఎం చేస్తామన్నారు

- డీపీఐ అధినేత తిరుమా

ప్యారీస్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న సందర్భంగా అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటే డిప్యూటీ సీఎం పదవి ఇస్తామన్నారని డీపీఐ అధ్యక్షుడు తిరుమావలవన్ పేర్కొన్నారు. పుదుచ్చేరిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తిరుమావలవన్ ఎన్నికల పొత్తు గురించి మాట్లాడుతూ, పీఎంకే, బీజేపీ పార్టీల కూటమిలో డీపీఐ ఎప్పటికీ చేరదన్నారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ పాల్గొన్న పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని తాను బహిష్కరించానని, ఒకవేళ తను పాల్గొని వుంటే ఆ పార్టీతో పొత్తు ఖరారైవుండేదని, ఆ అవకాశాన్ని కూడా కాదనుకున్నానని ఆయన తెలిపారు. అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకుంటే డిప్యూటీ సీఎం పదవి డిమాండ్ చేయవచ్చనని, నాలుగు మంత్రి పదవులు కోరవచ్చని, పలువురు సలహాలిచ్చారని, అయితే పదవుల కోసం ప్రస్తుతం ఉన్న డీఎంకే కూటమి నుంచి తమ పార్టీ వైదొలిగే ప్రసక్తేలేదన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసిన రాష్ట్రంలో మళ్ళీ డీఎంకే కూటమి అధికారంలో రావటం ఖాయమన్నారు. నటుడు విజయ్ నాయకత్వంలో నిర్వహిస్తున్న సభలకు వస్తున్న జనాన్ని చూసి వారంతా ఆ పార్టీకే ఓటు వేస్తారనే నమ్మకం లేదన్నారు. డీఎంకే ప్రభుత్వానికి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి అన్ని స్థానాల్లో గెలుస్తుందని తిరుమావళవన్ జోస్యం చెప్పారు.

పుదువైలో బీజేపీ నేత దారుణహత్య

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి బీజేపీ యువ మోర్చా నాయకుడు ఉమాశంకర్ (38)ను గుర్తు తెలియని దుండగులు వేటకొడవళ్లతో దాడి చేసి దారుణంగా హతమార్చారు. ఈ సంఘటన కారణంగా పుదుచ్చేరిలోని లాస్‌పేట, కరువడికుప్పం, సామిపిళ్లై తోట్టమ్ తదితర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం పారిశ్రామికవేత్త ఛార్లెస్ మార్టిన్ జన్మదిన వేడుకలను కరువడికుప్పం కల్యాణ మండపంలో జరిపే బాధ్యతలు ఉమాశంకర్‌కు అప్పగించారు. శనివారం రాత్రి మండపంలో ఏర్పాట్లను పరిశీలించి రాత్రి 11.30 గంటలకు ఇంటికి తిరిగి వెళ్తుండగా ఐదు బైకుల్లో వచ్చిన పదిమందికి పైగా గుర్తుతెలియని దుండగులు వేటకొడవళ్లతో ఆయనపై దాడి చేయగా ఉమాశంకర్ మృతి చెందాడు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న కుటుంబీకులు వచ్చి ఉమాశంకర్ వంటి నిండాగాయాలతో పడి ఉండటం చూసి బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ ఫుటేజీ ఆధారంగా హంతకులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.



ఉమాశంకర్ మృతదేహంపై పడి విలపిస్తున్న కుటుంబీకులు. ఇన్‌సెట్‌లో ఉమాశంకర్ (ఫైల్‌ఫొటో)

ఆస్పత్రిలో చేరిన సీఎం స్టాలిన్ మాతృమూర్తి

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ మాతృమూర్తి దయాళు అమ్మాళ్ అస్వస్థత కారణంగా నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. గోపాలపురంలోని ఇంట్లో నివసిస్తున్న దయాళు అమ్మాళ్ ఆదివారం ఉదయం హఠాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. ఆమెను వెంటనే గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. గత మార్చి 25న అస్వస్థతకు గురైన ఆమె ఆస్పత్రిలో మూడు రోజుల పాటు చికిత్స తీసుకున్న విషయం తెలిసిందే. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆమె మళ్లీ అస్వస్థతకు గురయ్యారు.



దయాళుఅమ్మాళ్



పళని దండాయుధపాణి ఆలయంలో స్వామివారి దర్శనంకోసం ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

సమాచార దృశ్విని

పుదుచ్చేరిలో బడులకు నేటినుంచి వేసవి సెలవులు

● ప్రభుత్వ ఉత్తర్వులు

పుదుచ్చేరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో సోమవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు పాఠశాలలకు వేసవి సెలవులను ప్రకటించారు. సెలవుల అనంతరం జూన్ 2వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభించాలని ఆ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వ నిధులు పొందుతున్న పాఠశాలల ప్రాంగణాల్లో సెలవురోజుల్లో మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు కనీస వసతులను మెరుగుపరచే పనులు చేపట్టాల్సిందిగా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలందాయి. ముందుగా రాష్ట్రంలో 6 నుండి 9వ తరగతులకు నిర్వహించిన పరీక్షలు ఈ నెల 23న ముగిసిన నేపథ్యంలో మరుసటి రోజు నుండి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు.

నేటినుంచి 'ఇస్కాన్' సమ్మర్ క్యాంప్

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): 'ఇస్కాన్ చెన్నై ఆధ్వర్యంలో సోమవారం నుంచి సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఆన్‌లైన్, ప్రత్యక్షంగా నిర్వహించనున్న తరగతులకు 6 నుంచి 17 ఏళ్లలోపున్న వారు పాల్గొనవచ్చు. ఇందులో చిన్నపిల్లల కథలు, శ్లోకాలు, కీర్తనలు గ్రాఫిక్స్, నిప్పు లేకుండా వంట తదితరాలు నేర్పించనున్నారు. అలాగే, ఒక నిమిషం వక్తృత్వ పోటీలు, చర్చా గోష్టి సహా పలు అంశాలు చోటుచేసుకున్నాయి. వారాంతపు రోజులు మినహా మిగిలిన రోజుల్లో తమిళం, ఆంగ్లం భాషలో శిక్షణ ఉంటుంది. మరిన్ని వివరాలకు 8072599295, www.iskconchennai.org/summercamp అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా 'నీట్' శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): 'నీట్' పరీక్షకు ఇంకా వారం రోజులు మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో, తరగతుల్లో చదివే సమయం ముగియగా, ఆన్‌లైన్, మొబైల్ యాప్ ద్వారా పరీక్షకు సిద్ధం కావచ్చని ప్రకటన వెలువడింది. యూజీ వైద్య కోర్సుల అడ్మిషన్లకు సంబంధించిన జాతీయ స్థాయి నీట్ పరీక్ష మే 4వ తేది జరుగనుంది. నీట్‌కు హాజరయ్యే విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోచింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసింది. ఈ నేపథ్యంలో, నీట్‌కు హాజరయ్యే తమిళంలో పరీక్ష రాసే విద్యార్థులు TNSED Manarkeni అనే మొబైల్ యాప్ ద్వారా పరీక్షకు సంబంధించిన సమాచారం అందించనున్నారు. ఏఏ విభాగాల్లో ప్రశ్నలు అధికంగా ఉంటాయి, మళ్లీ మళ్లీ అడిగే ప్రశ్నల వివరాలు, ప్రశ్నలు ఏ ఫార్మాట్‌లో ఉంటాయి, ప్రశ్నాపత్రం నమూనా, మార్కుల లెక్కింపు తదితరాలు వివరాలు కూడా ఈ యాప్‌లో ఉంటాయి. అలాగే, విద్యార్థులు తమ సందేహాలను 7373448484 అనే నెంబరు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

30న టీటీడీ ఆలయంలో బంగారు, వెండి డాలర్ల విక్రయాలు

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టినగర్ వెంకట నారాయణ రోడ్డులో ఉన్న టీటీడీ ఆలయంలో ఈ నెల 30వ తేది బంగారం, వెండి డాలర్లు విక్రయించనున్నారు. అక్షయ తృతీయ సందర్భంగా బంగారు, వెండి వంటి వస్తువులు కొనుగోలు చేస్తే మంచిదని భక్తుల నమ్మకం. భక్తుల సౌకర్యార్థం టీటీడీ ఆలయంలో బంగారు, వెండి డాలర్లు విక్రయిస్తున్నారు. డాలరు ఒకవైపు వెంకటేశ్వరస్వామి, మరో వైపు పద్మావతి అమ్మవారి చిత్రాలున్నాయి. ఈ 30వ తేది అక్షయ తృతీయ సందర్భంగా ఉదయం 9నుంచి రాత్రి9గంటల వరకు బంగారు, వెండి డాలర్లు విక్రయించనున్నారు.

ఏడాదికి 10 లక్షల మొక్కలు నాటనున్న జీసీసీ

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏడాదికి 10 లక్షల మొక్కలు నాటాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. ఈ విషయమై జీసీసీ పార్కుల నిర్వహణాధికారి ఒకరు మాట్లాడుతూ... నగరంలో ప్రతిరోజు సుమారు 3 లక్షల పెట్రోల్, డీజిల్ ప్రజలు వినియోగిస్తున్నారని, వాటి ద్వారా విడుదలయ్యే కార్బన్ డైయాక్సైడ్ ఐదు అణుబాంబులతో సమానమన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా అధికంగా ఆక్సిజన్ అందించేలా మొక్కలు నాటాలని నిర్ణయించామన్నారు. తొలివిడతగా మనలిలో 250 మొక్కలు, తిరువొత్తియూర్‌లో 10 ఎకరాల విస్తీర్ణంలో వెయ్యి మొక్కలు నాటామని తెలిపారు. అలాగే, జీసీసీ పరిధిలో ఏడాదికి 10 లక్షలు చొప్పున నాలుగేళ్లలో 40 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

2,015 టన్నుల రాగులు కొనుగోలు

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సైనికులకు అందించే ఆహారంలో చిరుధాన్యాలు చేర్చింది. అందుకోసం, రాష్ట్ర రైతుల నుంచి ప్రస్తుత సీజన్‌లో 17వేల టన్నుల రాగులు కొనుగోలుకు రాష్ట్ర వినియోగదారుల వాణిజ్య సమాఖ్యకు భారత ఆహార సంస్థ అనుమతిచ్చింది. రాష్ట్రంలో కృష్ణగిరి, సేలం, ధర్మపురి, ఈరోడ్ తదితర జిల్లాల్లో రాగులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు 846 మంది రైతుల నుంచి 2,015 టన్నుల రాగులు కొనుగోలు చేసి, వారికి గిట్టుబాటు ధరగా కిలోకు రూ.42.90 చొప్పున రూ.6.62 కోట్లు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. అలాగే, కాంచీపురం, నాగపట్టణం జిల్లాల్లోనూ రాగులు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

నేడు పూందమల్లి-పోరూర్ మధ్య మెట్రోరైలు ట్రయల్ రన్

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి-పోరూర్ మధ్య సోమవారం మెట్రోరైలు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. నగరంలో రెండో విడత మెట్రో ప్రాజెక్టులో 116 కి.మీ మేర మూడు మార్గాల్లో ఏర్పాటుకానుంది. అందులో ప్రధాన మార్గంగా లైట్ హౌస్-పూందమల్లి హైరోడ్డు మార్గంలో లైట్ హౌస్ నుంచి కోడంబాక్కం ఫ్లై ఓవర్ వరకు, కోడంబాక్కం పవర్ హౌస్ నుంచి పూందమల్లి హైరోడ్డు వరకు స్తంభాలపై మెట్రో మార్గం ఏర్పాటవుతోంది. ఈ మార్గంలో పూందమల్లి-పోరూర్ మధ్య రైలు మార్గం ఏర్పాటు, సిగ్నలింగ్ సహా పలు వ్యవస్థల ఏర్పాటు తుది దశకు చేరుకున్నాయి. ఈ మార్గంలో డిసెంబరు నుంచి మెట్రో రైళ్లు నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మార్గంలో ఈ నెల 20వ తేది పూందమల్లి-ముల్లై గార్డెన్ మధ్య 3 కి.మీ దూరం నిర్వహించిన డ్రైవర్ రహిత మెట్రో రైలు తొలి ట్రయల్ రన్ విజయవతమైంది. ఈ క్రమంలో, పూందమల్లి-పోరూర్ మధ్య 9.1 కి.మీ దూరం రెండో విడత మెట్రో రైలు ట్రయల్ రన్ సోమవారం జరుగనుంది.

78 యేళ్ల తర్వాత ఇళ్లవద్దకే రేషన్

● గిరిజనుల మోములో ఆనందం



నిత్యావసర సరకుల కోసం గాడిదలను సిద్ధం చేస్తున్న గ్రామస్తులు

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఏడు దశాబ్దాలకు పైగా రేషన్‌సరకుల కోసం ముప్పుతిప్పలు పడిన కొడైకెనాల్ సమీపం చిన్నూరు, పెరియూరు గిరిజనులు రెవెన్యూ అధికారులు తమ ఇళ్లవద్దకే రేషన్ సరకులను సరఫరా చేయడంతో వారి సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది. ఈ రెండు గ్రామాలు ఎత్తయిన కొండ ప్రాంతంలో ఉన్నాయి. రేషన్ సరకుల కోసం ఆ రెండు గ్రామాల గిరిజనులు ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్లి సరకులు తెచ్చుకునేవారు. ఈ రెండు గ్రామాలకు సరైన రహదారి సదుపాయం కూడా లేదు. రోజువారీ కిరాణా సరకులను తలపై మోసుకెళుతుంటారు. లేకుంటే గాడిదలు, గుర్రాలపై సరకులు వేసుకుని తీసుకెళ్తుంటారు. కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్ శరవణన్ ఈ రెండు గ్రామాలలో పర్యటించి అక్కడి గిరిజనులు రేషన్ సరకులు తెచ్చుకునేందుకు ఏడు కిలోమీటర్ల దూరం వరకూ నడిచి వెళుతున్నట్లు తెలుసుకున్నారు. ఇకపై వారి ఇళ్లవద్దకే రేషన్ సరకులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఇచ్చిన మాట ప్రకారం కొండ దిగువనున్న రేషన్‌షాపు నుంచి రేషన్ సరకులను గుర్రాలపై మోసుకెళ్ళి రెవెన్యూ సిబ్బంది గిరిజనుల ఇళ్ల వద్దే సరకులను అందజేశారు. 78 యేళ్ల తర్వాత తొలిసారిగా తమ ప్రాంతానికి గుర్రాలపై ఇళ్ల వద్దకే రేషన్‌షాపులు అధికారులు తీసుకురావటం చూసి గ్రామస్థులు సంబరపడిపోయారు. ఇదే రీతిలో గడ్డపారైకుళి, చిన్నూరు కాలనీ ప్రజలకు కూడా వారి ఇళ్ల వద్దకే రేషన్ సరకులు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎండల నుంచి పక్షులను కాపాడుకుందాం!



పక్షులకు నీటిని ఉంచడం కోసం ప్రజలకు గిన్నెలు అందిస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎండల నుంచి పక్షులు, ప్రాణులను రక్షించుకుందామని వక్తలు పిలుపునిచ్చారు. మొగప్పేర్‌లో 144 ఏళ్లగా ప్రాణులు, పక్షులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వాటి సంరక్షణకు చర్యలు చేపడుతోంది 'మద్రాసు ఎస్‌పీసీఏ' సంస్థ ఎండల నుంచి పక్షులను రక్షించేలా వాటికి తాగునీరు అందిచాలని కోరుతూ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా, నగరంలోని పలు ప్రాంతాల ప్రజలకు ప్లాస్టిక్ గిన్నెలు అందజేసి, మిద్దెలు, ఇళ్ల ముందు గిన్నెల్లో నీరు పోయాలని సూచించింది. కార్యక్రమంలో 'నీదియిన్ కురల్' అధ్యక్షుడు డా.సీ ఆర్ భాస్కరన్, పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లయన్ ఎన్.కన్నన్, డైరెక్టర్, నిర్మాత గిన్నిస్ బాబు గణేశన్ తదితరులు పాల్గొన్నారు.

30న డీఎండీకే సర్వసభ్య సమావేశం

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే కార్యవర్గ సమావేశం, సర్వసభ్య మండలి సమావేశం ఈ నెల 30వ తేది ధర్మపురి జిల్లా పాలక్కోడులో జరుగనుంది. ఈ మేరకు పార్టీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత నేతృత్వంలో జరుగనున్న సమావేశానికి కార్యవర్గ సభ్యులు, ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు, పార్టీ అనుబంధ శాఖ కార్యదర్శులు, ఉప కార్యదర్శులు, పుదుచ్చేరి, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, అండమాన్ తదితర రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేసింది. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, బూత్ కమిటీల ఏర్పాటు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ఏర్పాటు, పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాలు తదితరాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలో ప్రేమలత కుమారుడు విజయ్ ప్రభాకరన్ పార్టీలో ఉన్నతమైన పదవికి ఎంపిక చేసే అవకాశముందని సమాచారం. కాగా, విజయకాంత్ మృతి అనంతరం జరుగుతున్న తొలి పార్టీ సర్వసభ్య సమావేశం కావడం గమనార్హం.

రాష్ట్రంలో రానున్నది అన్నాడీఎంకే ప్రభుత్వమే!

● ప్రతిపక్ష ఉపనేత ఉదయ్‌కుమార్



వ్యాసార్పాడిలో వాహన చోదకులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి ఉదయకుమార్

ప్యారీస్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగబోయే ఎన్నికల్లో అన్నాడీఎంకే ఘనవిజయం సాధించి మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ప్రతిపక్ష ఉపనేత, మాజీమంత్రి ఆర్‌బి ఉదయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆదేశాల మేరకు అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని జయలలిత పేరవై ఆధ్వర్యంలో ప్రారంభించిన తిన్నెలపై ప్రచార కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా జరుగుతుంది. ఈ ప్రచారానికి 11 వారాలు పూర్తయిన సందర్భంగా శనివారం ఉత్తర చెన్నై జిల్లా వ్యాసర్పాడిలో అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శి ఆర్‌ఎస్ రాజేష్, పేరవై జిల్లా కార్యదర్శి డి.శరవణన్‌ల నేతృత్వంలో నిర్వహించిన తిన్నెల ప్రచారంలో ఆర్‌బి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనచోదకులు, వ్యాపారులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

ఎస్‌కేపీడీలో ముగిసిన వసంతోత్సవం



తెప్పపై విహరిస్తున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారు

ప్యారీస్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో వాసవాంబ వసంతోత్సవం వైభవంగా ముగిసింది. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు నవరాత్రులు అమ్మవారిని 12 రకాల పూలతో అలంకరించి చేసి సాయంత్రం 6 గంటలకు కళాకారుల బృందాలు కీర్తనలు ఆలపించి తమ భక్తిని చాటుకున్నారు. వాసవీ మాతను దంతపల్లకీ, సింహవాహనంలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. బంగారు, వెండి కవచంతో అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. వసంతోత్సవంలో భాగంగా గురు,శుక్ర,శని వారాల్లో తెప్పోత్సవం నిర్వహించారు. ఎస్‌కేపీడీ ట్రస్టీలు భక్తులకు తీర్థ, అన్నదాన ప్రసాదాలు పంపిణీ చేసి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ స్కూలులో పెళ్ళిరోజులు వేడుకలు

● టీచర్, హెడ్మాస్టర్‌పై బదిలీవేటు



పెళ్లిరోజు వేడుకలు జరుపుకుంటున్న టీచర్ సుధాకర్ దంపతులు

టి.నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపం చిన్నవరిగం గ్రామంలోని మాధ్యమిక పాఠశాలలో పెళ్ళిరోజు వేడుకలు జరుపుకున్న టీచర్‌పై, ఆ వేడుకలకు అనుమతించిన హెడ్మాస్టర్‌పై బదిలీ వేటు పడింది. ఆ పాఠశాలలో సుధాకర్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య కూడా ఆ స్కూల్‌లోనే తాత్కాలిక ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. మూడు రోజులకు ముందు సుధాకర్ తన పెళ్ళి రోజు వేడుకలను ఆ పాఠశాల తరగతి గదిలో ఉపాధ్యాయుల సమక్షంలో కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఆ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వెలువడటంతో జిల్లా విద్యాశాఖాధికారులు గమనించి పెళ్ళిరోజు చేసుకున్న ఉపాధ్యాయుడు సుధాకర్‌ను ఉద్యేందిరం ప్రభుత్వ పాఠశాలకు, ఆ వేడుకలకు అనుమతించిన హెడ్మాస్టర్ సరోజినిని వెంగలి పాఠశాలకు బదలీ చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో పుట్టిన రోజు వేడుకలు, పెళ్ళిరోజు వేడుకలు జరుపకూడదనే ఆంక్షలు ఉన్నాయని, ఈ విషయం తెలిసి కూడా సుధాకర్ తన పెళ్ళి రోజు వేడుకలను పాఠశాలలో జరుపుకోవటం గర్హనీయమని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు.

తెలుగు వారిపై సీమాన్ విమర్శలు

నిరసనగా తెలుగు మున్నేట్ర కళగం ధర్నా



ధర్నాలో పాల్గొన్న తెలుగు మున్నేట్ర కళగం నేతలు, కార్యకర్తలు

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాట తెలుగువారికి స్థానం లేదంటూ స్వాతంత్ర్య సమరయోధుడు వీరపాండ్య కట్టబ్రహ్మన కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగిస్తూ నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ చేస్తున్న విమర్శలు, వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ తెలుగు మున్నేట్ర కళగం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. అన్నాసాలై సమీపంలోని స్వామి శివానంద శాలైలో జరిగిన ఈ ఆందోళనలో ఆ పార్టీ నేతలు పుగళ్ బాలాజీ, ముని ఆరుముగం, ఇలాయ కట్టబొమ్మన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తెలుగువారు వద్దని చెబుతున్న సీమాన్ తెలుగువారైన ఆయన సతీమణిని ఇంటి నుడి తరిమేస్తారా అంటూ ప్రశ్నించారు. సీమన్ పాంచాలకురిచ్చి సినిమా తీస్తున్నప్పుడు ఆయనకు అండగా నిలిచింది తెలుగువారేననే విషయాన్ని మరచిపోయారని తెలిపారు. ఇకనైనా సీమాన్ తెలుగువారిని విమర్శించడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి, ప్రజా ప్రతినిధులు, అధికారులు

వేలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పంచాయతి యూనియన్లలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 238 మంది దివ్యాంగులకు ఆర్‌ఈసీ సంస్థ తరపున రూ.52.87 లక్షల విలువైన 415 కృత్రిమ అవయవాలు, పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, ఆర్‌ఈసీ సంస్థ డైరెక్టర్, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు నారాయణ తిరుపతి, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ బోర్డుల విరాళం



పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సీఎస్ఆర్ గ్రాంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా, రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ - టి నగర్ నిర్వాహకులు చెన్నై స్కూల్స్‌కు రూ.28.60 లక్షల విలువైన 16 స్మార్ట్ బోర్డులను విరాళంగా అందజేశారు. రాయపేటలోని వెంకటేశ్వర మెట్రిక్యులేషన్ హైయ్యర్ సెకండరీ స్కూల్, టి.నగర్‌లోని గుంటూరు సుబ్బయ్య పిళ్ళై బాలికల హైయ్యర్ సెకండరీ స్కూల్‌కు 9 చొప్పున స్మార్ట్ బోర్డులు, జార్జిటౌన్, శివముత్తయ్య వీధిలోని కేఆర్‌సీ ఏఆర్‌సీ హైయ్యర్ సెకండరీ స్కూల్‌కు రెండు చొప్పున ఈ స్మార్ట్ బోర్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ రత్నం కె.సుభాష్‌చంద్ర, రోటరీ డిస్ట్రిక్ట్ 3233 గవర్నర్ మహావీర్ బోత్రా, డిస్ట్రిక్ట్ రోటరీ ఫౌండేషన్ చైర్మన్ నీలకంఠన్ లోకనాథన్, టి నగర్ రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాస్ ప్రెసిడెంట్ నరేంద్ర శ్రీశ్రీమాల్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలను తనిఖీ చేయండి

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సరుకులు అందుతున్నాయా?లేదా?అనే విషయమై అధికారులు రేషన్ దుకాణాలకు తనిఖీ చేయాలని ఆహార శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దిండుగల్ జిల్లాలోని ఓ రేషన్ దుకాణాన్ని ఇటీవల జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రేషన్ దుకాణాల ద్వారా వినియోగదారులకు అందిస్తున్న కందిపప్పులో కల్తీ జరిగినట్లు కలెక్టర్ గుర్తించారు. ఈ విషయమై విచారణకు ఆదేశించిన కలెక్టర్, ఒక అధికారిపై చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో, వినియోగదారులకు కల్తీ సరుకులు అందించడాన్ని అడ్డుకొనేలా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, కల్తీ కందిపప్పు సరఫరా చేసిన ఐదు సంస్థలను విచారించాలని కలెక్టర్లకు ఆహార శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

విహారంలో విషాదం

భూపతీశ్వరకోనలో యువకుడి మృతి



సచిన్ (ఫైల్)

సత్యవేడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విహార యాత్రకు వచ్చిన యువకుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన తిరుపతి జిల్లా నాగలాపురం మండలం భూపతీశ్వరకోనలో ఆదివారం జరిగింది. నాగలాపురం ఎస్ఐ సునీల్ కథనం తెలిపిన వివరాలిలా ఉన్నాయి... టీపీ కోట సమీపంలోని భూపతీశ్వర కోన జలపాతానికి చెన్నైకు చెందిన నలుగురు యువకులు వచ్చారు. స్నానం కోసం మడుగులో దిగారు. వీరిలో సచిన్ (22) నీట మునిగి ఎంత సేపైనా బయటకు రాకపోవడంతో మిగిలిన స్నేహితుల్లో ఒకరైన హేమంత్ నెం.100కు డయల్ చేసి సమాచారం అందించాడు. కంట్రోల్ రూం నుండి వచ్చిన సమాచారం మేరకు నాగలాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నీటిలో గాలించి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టంకు తరలించారు. కాగా మృతి చెందిన సచిన్ తిరుప్పూర్‌కు చెందిన మూర్తి కుమారుడు. ఇతను చెన్నై గిండిలోని రాంకో సిస్టమ్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితులతో కలిసి చెన్నైలో ఉంటున్నట్లు తెలిసింది.

ఉపాధ్యాయ హోంలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ సంఘం కాట్పాడి శాఖ, వేలూరు మనిదనేయ కేంద్రం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ హోం ప్రాంగణంలో చలివేంద్రం ప్రారంభించారు చలివేంద్రాన్ని రెడ్‌క్రాస్ సంఘ కాట్పాడి డివిజన్ అధ్యక్షులు జనార్ధనన్, మనిదనేయ కేంద్రం జనరల్ సెక్రటరీ దొరై కరుణానిధి ప్రారంభించారు.

మే 31వ తేది వరకు వ్యాపార లైసెన్స్ రెన్యువల్‌కు అవకాశం

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో ఉన్న 65,822 మంది వ్యాపారులు, తమ సౌలభ్యాన్ని బట్టి ఒకటి నుంచి మూడు సంవత్సరాల వరకు వ్యాపార లైసెన్స్ పునరుద్ధరించుకుంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 32,551 మంది వ్యాపారులు తమ లైసెన్స్ పునరుద్ధరించగా, మిగిలిన వ్యాపారులకు జరిమానా లేకుండా వ్యాపార లైసెన్స్ పునరుద్ధరణకు రెండు నెలల గ్రేస్ పీరియడ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి జీసీసీ విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తి పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం, జరిమానా లేకుండా వ్యాపార లైసెన్స్ పునరుద్ధరణకు మే 31వ తేది వరకు అవకాశమిచ్చినట్లు, వ్యాపారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

రూ.13 కోట్లతో తిరునీర్‌మలై చెరువు పునరుద్ధరణ

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాపనుల శాఖ ఆధీనంలోని తిరునీర్‌మలై పెద్ద చెరువు విస్తీర్ణం 194.01 ఎకరాలు కాగా, ఆక్రమణలతో ప్రస్తుతం 146.94 ఎకరాలకు తగ్గింది. తాంబరం, శానిటోరియం, మెప్స్ ప్రాంగణం, క్రోంపేట, పల్లావరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే మురికి నీరు ఈ చెరువులో కలుస్తుండడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. చెరువులో మురుగునీరు చేరకుండా అడ్డుకుని పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతవాసులు విజ్ఞప్తులతో, గత నెల చెన్నై కార్పొరేషన్ బడ్జెట్‌లో చెరువు పునరుద్ధరిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో, రూ.13 కోట్లతో చెరువు పునరుద్ధరణ పనులను శనివారం మంత్రి అన్బరసన్ ప్రారంభించారు.

సైబర్ క్రైం పేరుతో నకిలీ సోషల్ మీడియా

● అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సైబర్ క్రైం పోలీసుల విభాగం పేరు, 'లోగో' వినియోగించి నకిలీ సోషల్ మీడియా ఖాతా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు శాఖ హెచ్చరించింది. ఈ విషయమై సైబర్ క్రైం పోలీసు విభాగం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర పోలీసు శాఖలో 'సైబర్ క్రైం' విభాగం, ప్రజలకు డిజిటల్ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తోంది. ప్రస్తుతం సైబర్ క్రైం పేరు, లోగోతో సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలున్నట్లు గుర్తించామన్నారు. వాటిని స్తంభింపజేసినట్లు, @tncybercrimeoff అనే అధికారపూర్వక ఖాతా మాత్రమే సైబర్ క్రైంకు ఉందని ప్రకటనలో తెలిపారు.

అమ్మవారి గుడిలో దొంగకు చేదు అనుభవం

హుండీలో చేయి ఇరుక్కుని రాత్రంతా జాగరం



అరెస్టయిన తంగరాజ్

టి.నగర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా నల్లంపల్లి సమీపం శేషంపట్టి గ్రామంలోని 'పెరియాండిచ్చి' అమ్మవారి ఆలయంలో హుండీలోని సొమ్ము కాజేసేందుకు ప్రయత్నించిన దొంగకు చేదు అనుభవం ఎదురైంది. ధర్మపురి జిల్లా చవులూరు గ్రామానికి చెందిన తంగరాజ్ (42) అనే ఆ దొంగ శనివారం అర్ధరాత్రి ఆ హుండీలో రంధ్రం వేసి అందులో చేయిపెట్టి నగదును బయటకు లాగేందుకు ప్రయత్నించగా, చేయి ఇరుక్కుపోయింది. చేతిని బయటకు తీసేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. రాత్రంతా ఆ దొంగ అక్కడే జాగరం చేశాడు. ఆదివారం ఉదయం గ్రామస్థులు ఆ గుడి వైపు వెళ్తూ అమ్మవారి ఆలయ హుండీ వద్దనున్న దొంగను చూసి వెళ్లి, అతడి చేయి హుండీలో ఇరుక్కుపోయి ఉండడం గమనించారు. వెంటనే ఆ దొంగను చితకబాది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో కలిసి వచ్చి హుండీ పైభాగాన్ని తొలగించి ఆ దొంగ చేయి బయటకు తీశారు. ఆ తర్వాత పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు పంపారు.

పెరంబూరు రైల్వేస్టేషన్‌లో 7 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురు ఒడిశా యువకుల అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు రైల్వేస్టేషన్‌కు చట్ట విరుద్ధంగా గంజాయి తరలించిన ఒడిశాకు చెందిన ముగ్గురు యువకులను అరెస్టు చేసిన రైల్వే పోలీసులు వారినుండి 7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సైదాపేట ఏసీపీ హెచ్చరికల మేరకు పెరంబూరు రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ సిబ్బంది శనివారం తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం ఎర్నాకులం నుంచి వచ్చిన ఎక్స్‌ప్రెస్‌లో దిగిన ముగ్గురు యువకులను అనుమానంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేసి, వారినుండి 7 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు ఒడిశాకు చెందిన బలరామ్, మహేంద్ర, దీనక్ అని తెలిసింది. వారిని రైల్వే పోలీసులు కుమరన్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

రూ.3 లక్షల విలువైన మత్తుమాత్రల రవాణా

● ముగ్గురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మత్తుమాత్రలు - అరెస్టయిన యువకులు

తిరుత్తణి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో చట్ట విరుద్ధంగా మత్తుమాత్రలను తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే తిరుత్తణి-చిత్తూరు నేషనల్ హైవేలో వున్న చెక్‌పోస్టులో ఆదివారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అతి వేగంగా వస్తున్న ఓ కారును ఆపి, చెక్ చేసిన పోలీసులు అందులో రూ.3 లక్షల విలువైన మత్తుమాత్రలను స్వాధీనం చేసుకొని, తాంబరానికి చెందిన దినకరన్, కమల్, శక్తివేల్ ను అరెస్టు చేశారు. విచారణలో వీరు ముంబయిలోని ఓ వ్యక్తి నుంచి రూ.3 లక్షల విలువైన మత్తుమాత్రలను కొనుగోలు చేసి విద్యార్థులకు విక్రయిస్తున్నట్లుగా తెలిసింది. పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

నామక్కల్‌లో పేరుకుపోతున్న గుడ్ల నిల్వలు

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లాలో 40 శాతం కోడి గుడ్లు గోదాముల్లో పేరుకుపోతున్నాయి. నామక్కల్ జిల్లాలో మొత్తం 1,100 కోళ్ల ఫారాల ద్వారా ప్రతిరోజు సుమారు 6 కోట్ల గుడ్లు వస్తుండగా, రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలు, పలు దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, పాఠశాలలకు సెలవుల కారణంగా మధ్యాహ్న భోజనానికి అందించే సుమారు కోటి గుడ్లు, కోడిగుడ్లలో ఉండే పసుపు సొనతో తయారుచేసే మయోనైస్‌పై నిషేధం విధించడంతో, మరో 80 లక్షలు గుడ్లు గోదాముల్లో పేరుకుపోయాయని వ్యాపారులు వాపోతున్నారు.

భార్యను హతమార్చి భర్త ఆత్మహత్య

పెరంబూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): భార్యను హతమార్చిన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పుదుకోట జిల్లాలో చోటుచేసుకుంది. వడవాళం సమీపం కీళకాయంపట్టికి చెందిన వీరముత్తు-రాజేశ్వరి (23) దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. భార్యాభర్తలు భవన కార్మికులుగా పనిచేస్తుండగా, కొద్దిరోజులుగా భార్య నడవడికపై సందేహించిన వీరముత్తు, పలుమార్లు ఆమెతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో, శుక్రవారం రాత్రి భార్యాభర్తలు ఇద్దరూ కల్లుపాళయం గ్రామంలోని ఆలయ వేడుకలకు వెళ్లారు. ఆ సమయంలో, పిల్లలను వీరముత్తు తన తల్లి లక్ష్మి ఇంట్లో వదిలిపెట్టాడు. శనివారం పిల్లలను వదిలిపెట్టేందుకు వీరముత్తు ఇంటికి తల్లి వెళ్లింది. ఆ సమయంలో గొంతుపై గాయాలతో రాజేశ్వరి, పక్కనే ఉరేసుకొని వీరముత్తు పడి ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందింది. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.



త్రివేణి సంగమంలో పర్యాటకుల సందడి

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి త్రివేణి సంగమ ప్రాంతం వద్ద ఆదివారం వేకువజాము సూర్యోదయం దృశ్యాన్ని వీక్షించేందుకు వేల సంఖ్యలో పర్యాటకులు గుమికూడారు. శనివారం మధ్యాహ్నం నుండే కన్నియాకుమారికి వేలాదిమంది పర్యాటకులు తరలిరావటంతో అన్ని ప్రాంతాలు సందడిగా మారాయి. వివేకానంద స్మారక మండపం, తిరువళ్లువర్ విగ్రహం ప్రాంతం, ఆ రెండు ప్రాంతాల నడుమనున్న అద్దాల వంతెన ప్రాంతం తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు గుమికూడారు. ఈ నేపథ్యంలో వేకువజాము 5.30 గంటలకే సూర్యోదయ దృశ్యాన్ని వీక్షించడానికి మూడు సముద్రాలు కలిసే త్రివేణి సంగమ ప్రాంతం వద్ద వేల సంఖ్యలో పర్యాటకులు గుమికూడారు. అయితే ఆకాశం కాస్త మేఘావృతంగా ఉండటంతో సూర్యోదయం చూడలేక పర్యాటకులు నిరాశ చెందారు. ఆ తర్వాత త్రివేణి సంగమంలో పర్యాటకులు సముద్రస్నానం చేసి, భగవతి అమ్మవారి ఆలయానికి వెళ్లారు. వివేకానంద కేంద్రం, గాంధీ స్మారక మండపం, కామరాజర్ మణిమండపం, టూరిస్టు పార్క్ తదితర ప్రాంతాల్లోనూ పర్యాటకులు పెద్ద సంఖ్యలో గుమికూడారు.



న్యూ జస్టిస్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన దివాన్ బహదూర్ సర్ పిట్టి త్యాగరాయ శ్రేష్ఠి 174వ జయంతి సందర్భంగా రిప్పన్ భవనం వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి, చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం, మేయర్ ఆర్.ప్రియ, ఎమ్మెల్యే ఏఎంవీ ప్రభాకర్‌రాజా, కార్పొరేషన్ కమిషనర్ జే కుమారగురుబరన్ తదితరులు

తిరుచెందూరుకు పోటెత్తిన భక్తులు



తిరుచెందూరు ఆలయం వద్ద సముద్రతీరంలో స్నానమాచరిస్తున్న భక్తులు

టి.నగర్ ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. శనివారం ఉదయం నుండే ఈ ఆలయానికి రాష్ట్రం నలమూలల నుండి భక్తులు తరలివచ్చారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో ఈ ఆలయానికి భక్తులు తమ పిల్లలతో విచ్చేస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలిరావటంతో ఆలయం చుట్టూ భక్తులరద్దీ అధికమైంది. స్వామివారి దర్శన క్యూలైన్లలో, అన్నదానం క్యూలైన్లలో, నాళికినరు క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఈ భక్తులంతా సముద్రస్నానమాచరించి, నాళికినరులో పవిత్రజలాలను శిరస్సులపై చల్లుకుని క్యూలైన్లలో నిలిచి స్వామివారిని దర్శించేందుకు సుమారు నాలుగు గంటలు పట్టింది. భక్తుల రద్దీ అధికం కావటంతో ఆలయ నిర్వాహకులు వాహనాలకు తాత్కాలిక పార్కింగ్ సదుపాయం కూడా కల్పించారు. భక్తులకు తాగునీటి సదుపాయం కల్పించారు. భక్తులు సొమ్మసిల్లిపడితే చికిత్సలందించడానికి వైద్య బృందాలను కూడా సిద్ధం చేశారు. అక్కడక్కడా చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు.

తిరుత్తణి మురుగన్ సేవలో నటి గౌతమి



స్వామివారిని దర్శించుకుంటున్న నటి గౌతమి

తిరుత్తణి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయాన్ని ఆదివారం నటి గౌతమి సందర్శించారు. ఈ క్రమంలో గౌతమి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చాలా రోజులనుండి మురుగన్ దర్శనానికి రావాలనుకుంటున్నానని ఆ కోరిక ఇప్పటికి తీరిందని తెలిపారు. అనంతరం ఆలయంలో వినాయకునికి పూజలు చేసి, ఆలయ నిర్వాహకులతో కలిసి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎస్ఆర్ఎం వర్సిటీ ఆధ్వర్యంలో సముద్ర కాలుష్యంపై సైకత శిల్పాల ప్రదర్శన



తాబేలు, డాల్ఫిన్, తిమింగిలం ఆకారాలతో రూపొందించిన సైకత శిల్పాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు, నగరవాసులు

చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్‌లోని స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ఇంటీరియర్ డిజైన్ విభాగం విద్యార్థులు ఎలియట్స్ బీచ్‌లో సముద్ర కాలుష్యంపై అవగాహన కల్పించేలా ఆదివారం సైకత శిల్పాలను రూపొందించారు. విద్యార్థులు తమ సృజనాత్మక శక్తితో పర్యావరణంపై అవగాహన పెంచేలా ఈ సైకత శిల్పాలను తీర్చి దిద్దారు. అదే సమయంలో బీచ్‌కు వచ్చిన నగరవాసులు సైతం ఆ సైకత శిల్పాల విశేషాలు గురించి విద్యార్థులు చెబుతుండగా విన్నారు. సముద్ర కాలుష్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలంటూ నగరవాసులు విద్యార్థులకు సూచించారు.

ఘనంగా సర్ పిట్టి త్యాగరాయ శ్రేష్ఠి 173 జయంతి వేడుకలు



త్యాగరాయ శ్రేష్ఠి విగ్రహానికి నివాళులర్పిస్తున్న తెలుగు ప్రముఖులు

అడయార్, ఏప్రిల్ 27: (ఆంధ్రజ్యోతి): దివాన్ బహదూర్, జస్టిస్ పార్టీ వ్యవస్థాపకులు, మద్రాస్ నగర ప్రథమ మేయర్, శ్వేతాంబర యోగి, దేవాంగ ప్రముఖులు సర్ పిట్టి త్యాగరాయ శ్రేష్ఠి 173వ జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ముందుగా మన్నప్ప వీధిలో ఉన్న సర్ త్యాగరాయ ఉన్నత పాఠశాల నుంచి త్యాగరాయ ఉద్యానవనం వరకు ఊరేగింపు నిర్వహించారు. తెలుగు భాషా సేవకులు ఎంఆర్ సుబ్రహ్మణ్యం, మాచెర్ల మునిరాజ, దేవి మాధవయ్య న్యాయవాది సతీష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో కోణంకి జనార్థనం, మన్ని వెంకటేశ్వర్లు, మత్సా జానకిరామ్, మద్రాస్ హైకోర్టు న్యాయవాది హరికృష్ణ జక్కుల, పమ్మి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిన్న బడ్జెట్‌లో మంచి చిత్రాలు తీయండి

● పీసీ శ్రీరామ్



'డ్రీమ్ గర్ల్' ఆడియో రిలీజ్ దృశ్యం

అతి తక్కువ బడ్జెట్‌తో మంచి చిత్రాలు నిర్మించాలని దర్శక నిర్మాతలకు ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ సూచించారు. దర్శకుడు ఎంఆర్ భారతి రూపొందించిన ఈ చిత్రంలో కొత్తవారు జీవా, హరీషా, ప్రభు సస్తా, ఇందిరా తదితరులు నటించారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ నగరంలో తాజాగా జరిగింది. ఇందులో సినీ ప్రముఖులు పీసీ శ్రీరామ్, దర్శకులు వసంత బాలన్, కదిర్, అజయన్ బాలా, నందా పెరియస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీసీ శ్రీరామ్ మాట్లాడుతూ, 'నేను చెప్పిన ఒక వన్‌లైన్ స్క్రిప్టు డెవలప్‌చేసి ఎంతో హృద్యంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. దర్శక నిర్మాతలు ఇలాంటి చిన్న బడ్జెట్ చిత్రాలను మాత్రమే నిర్మించాలి. కోట్లాది రూపాయలను ఖర్చు చేసి భారీ బడ్జెట్ చిత్రాలు నిర్మించాల్సిన అవసరం లేదు. దర్శకుడు భారతికి అభినందనలు' తెలిపారు. దర్శకుడు వసంత బాలన్ మాట్లాడుతూ, 'ఇసైజ్ఞాని ఇళయరాజా స్థాయికి ఏమాత్రం తీసిపోని కళాకారుడు పీసీ శ్రీరామ్. కెమెరాతో ఒక మాయాజాలం చేస్తారు. త్వరలో ఆయనకు సన్మానం చేస్తాం' అని వెల్లడించారు. హీరో జీవా మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నటించడం జీవితంలో మరచిపోలేని అనుభవం. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడు భారతి మాట్లాడుతూ, 'ఈ ప్రాజెక్టు కోసం కొన్ని సన్నివేశాలను మాత్రం షూట్ చేయాలని ప్లాన్ చేశాం. కానీ, షూటింగ్ మొదలుపెట్టిన తర్వాత కేవలం 16 రోజుల్లో సింహభాగం షూటింగ్ పూర్తి చేశాం. ఈ మూవీ అన్ని తరగతుల ప్రేక్షకులకు నచ్చేలా నిర్మించాం' అన్నారు.



ప్రియాంక మోహన్ ప్రధాన పాత్రలో 'వెబ్ సిరీస్'

తమిళం, తెలుగు భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్న హీరోయిన్ ప్రియాంకా అరుళ్ మోహన్ స్టార్ హీరోలు సూర్య, శివకార్తికేయన్ తదితరులతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు.. ఈ నేపథ్యంలో ఆమె వెబ్ సిరీస్‌లో ప్రధాన పాత్ర పోషించేందుకు అంగీకరించినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. 'నిత్తం ఒరు వానం' అనే చిత్రాన్ని దర్శకత్వం వహించిన ఆర్.కార్తీక్ ఈ వెబ్‌సిరీస్‌ను రూపొందిస్తుండగా, ఇప్పటికే షూటింగ్ కొరియాలో ప్రారంభించారు. చిత్రీకరణ పూర్తయిన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ చేయనున్నారు.

చిత్రజ్యోతి

మంచి అవకాశం వస్తే తమిళంలో నటిస్తా : హీరో నాని



నాని, శ్రీనిధి శెట్టి, వినోద్ కుమార్

కోలీవుడ్‌లో రోజురోజుకూ అభిమానుల ప్రేమ, మద్దతు పెరుగుతోందని మంచి అవకాశం వస్తే మాత్రం తప్పకుండా తమిళ చిత్రంలో నటిస్తానని నేచురల్ స్టార్ నాని అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హిట్-3'. మే 1 తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని, తాజాగా నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో హీరో నాని, హీరోయిన్ శ్రీనిధి శెట్టి తదితరులు పాల్గొన్నారు. ఇందులో నాని మాట్లాడుతూ, 'చెన్నై వచ్చినప్పుడల్లా సొంతింటికి వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది. తమిళ సినిమా నన్ను డిజైన్ చేసిందని చాలాసార్లు చెప్పాను. 2012-13లో నేను చెన్నై వదిలి హైదరబాద్ వెళ్ళాను. అయితే ఇప్పటికీ తమిళ ప్రజలు, తమిళ అభిమానుల ప్రేమ మెండుగా ఉన్నాయి. తమిళంలో నటించాలని కూడా ఉంది. మంచి అవకాశం వస్తే మాత్రం ఖచ్చితంగా నటిస్తాను. 'హిట్ ది థర్డ్ కేస్'తో మళ్ళీ ప్రేక్షకుల ముందుకురావడం సంతోషంగా ఉంది. 'హిట్' మొదటి, రెండు భాగాలు తమిళంలో విడుదలై వుంటాయని భావిస్తున్నాను. ఈ రెండు భాగాల్లోని కొన్ని సన్నివేశాలు మూడో భాగంలోనూ కనిపిస్తాయి. కానీ, మొదటి రెండు భాగాలతో సంబంధం లేదు. ఈ సినిమా స్క్రిప్టు డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు శైలేష్ కొలను, సినిమాటోగ్రాఫర్ సానుజాన్ వర్గీస్, సంగీతం దర్శకుడు మిక్కీ జే మేయర్ సినిమా కోసం ఎంతగానో శ్రమించారు. ఇది అరుదైన థ్రిల్లర్ మూవీ. ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ జానర్‌లో సాగుతుంది. మంచి మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాను తమిళంలో విడుదల చేస్తున్న నిర్మాత వినోద్ కుమార్‌కు నా ధన్యవాదాలు. మే ఒకటో తేదీన విడుదలవుతున్న సూర్య 'రెట్రో'తో పాటు మా సినిమా కూడా హిట్ కావాలని కోరుకుంటున్నాం' అని పేర్కొన్నారు.

'సూపర్-6' యాప్ ఆవిష్కరణ



యాప్ ఆవిష్కరణలో ఎస్.బద్రినాథ్, ప్రియా ప్రకాష్

'సూపర్-6' యాప్‌ను నటి ప్రియా ప్రకాష్ వారియర్ తాజాగా ఆవిష్కరించారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారత క్రికెటర్ ఎస్.బద్రినాథ్ మరో అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నటి ప్రయా ప్రకాష్ వారియర్ మాట్లాడుతూ, 'నాకు క్రికెట్ ఆట అంటే అమితమైన ఇష్టం. స్వదేశంలో జరుగుతున్న ఐపీఎల్ పోటీలను క్రమం తప్పకుండా చూస్తాను. మిస్టర్ కెప్టెన్ కూల్ ధోనీ అంటే నాకు చాలా ఇష్టం. అలాగే, చెన్నై సూపర్ కింగ్స్ నాకు ఇష్టమైన జట్టు. సూపర్-6 యాప్ ఆడేందుకు ఎంతో సులభంగా ఉండేలా డిజైన్ చేశారు. అలాంటి యాప్ లాంచింగ్ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది' అన్నారు. క్రికెటర్ బద్రీనాథ్ మాట్లాడుతూ, 'దేశంలో గేమింగ్ యాప్‌లు మరో స్థాయికి చేరుకున్నాయి. ఈ యాప్‌లో క్రికెట్ ఆడటం ఎంతో సులభం. పైగా ఆడుతున్న కొద్దీ ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. ప్రతి ఒక్కరూ ఈ యాప్‌లో ఆడుతూ విజయం సాధించాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోవైలో ఉరకలేసిన ఉత్సాహం

గగుర్పాటు కలిగించిన జల్లికట్టు విన్యాసం









చెన్నై, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరులో ఆదివారం ఉదయం నిర్వహించిన జల్లికట్టు వేడుకలు యువకులకు, ప్రేక్షకులకు గగుర్పాటు కలిగించింది. సంక్రాంతి జల్లికట్టు క్రీడలను తలపించేలా ఈ జల్లికట్టు క్రీడను నిర్వహించారు. అటు పదునైన కొమ్ములతో రంకెలేస్తూ పరుగులు తీసిన ఎద్దులు, ఎద్దుల మోపులను పట్టుకుని అణచివేయడంలో అనుభవం కలిగి సాహస వంతులైన యువకులు పోటీపడటంతో ప్రతి రౌండూ అట్టహాసంగానే ముగిసింది. ఈ పోటీలో ఎక్కువ సంఖ్యలో ఎద్దులను అణచివేసి ప్రథమ స్థానంలో నిలిచే యువకుడికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తరఫున లగ్జరీ కారు, అదే విధంగా ఈ పోటీల్లో యువకులకు చిక్కకుండా వారిని ముప్పుతిప్పలు పెట్టి ప్రథమ స్థానంలో నిలిచే ఎద్దు యజమానికి ఉపముఖ్యమంత్రి ఉదయనిధి తరఫున లగ్జరీ కారు కానుకగా ప్రకటించారు. కోయంబత్తూరు జిల్లా యంత్రాంగం, తమిళర్ పన్పాట్టు జల్లికట్టు పేరవై సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ పోటీలను రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీ జెండా ఊపి ప్రారంభించారు. పేరవై అధ్యక్షుడు దళపతి మురుగేశన్, జిల్లా కలెక్టర్ భవన్‌కుమార్, మేయర్ రంగనాయకి, కార్పొరేషన్ కమిషనర్ శివగురు ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా జల్లికట్టు క్రీడలో పాల్గొననున్న యువకుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా వాడివాసల్ నుండి కోయంబత్తూరు వరదరాజపెరుమాళ్ ఆలయ ఎద్దును విడిచిపెట్టారు. యువకులు ఆ ఎద్దు జోలికిపోకుండా వదిలేశారు. సుమారు 800 మంది యువకులు రౌండ్‌కు 40 మంది చొప్పున పాల్గొని సత్తా చాటుకున్నారు. వాడివాసల్ వద్దే కొన్ని ఎద్దులు యువకులను కొమ్ములతో పొడిచేందుకు ప్రయత్నించాయి. మరి కొన్ని ఎద్దులు వేగంగా మైదానం మధ్యలో తిరుగుతూ యువకులను తరిమికొట్టాయి. ఈ నేపథ్యంలో సుమారు యాభైకి పైగా ఎద్దులను పట్టుకుని కదలకుండా చేసిన యువకులు బీరువాలు, మంచాలు, టీవీలు, పరుపులు, స్టీలు, ఇత్తడి బిందెలను కానుకలుగా పొందారు. ఈ పోటీలను పురస్కరించుకుని క్రీడలో పాల్గొన్న యువకులకు ముందుగా వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు. పోటీలో గాయపడిన వారికి చికిత్స అందించడానికి ప్రత్యేక వైద్యులను కూడా సిద్ధంగా ఉంచారు. ఆద్యంతమూ ఉత్కంఠ భరితంగా ఈ జల్లికట్టు పోటీలు ఆదివారం రాత్రి ఏడుగంటలకు ముగిశాయి.



వాడివాసల్ నుంచి పరుగులు తీసేందుకు సిద్ధంగా ఉన్న కోవై వరదరాజపెరుమాళ్ ఆలయ ఎద్దు



భక్తిశ్రద్ధలతో చిత్తిరై అమావాస్య పూజలు

● రామేశ్వరంలో పితృదేవతలకు తర్పణాలు



రామేశ్వరం అగ్నితీర్థంలో అశేషభక్తజనం

ప్యారీస్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చిత్తిరై అమావాస్య పర్వదినం సందర్భంగా ఆదివారం రామనాథపురం జిల్లా రామేశ్వరం రామనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఇక్కడున్న అగ్నితీర్థ కడలిలో పుణ్యస్నానమాచరించి పితృదేవతలకు తర్పణాలు వదిలారు. తీర్థమూర్తుల క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన రామేశ్వరంలో ఆడి అమావాస్య, తై అమావాస్య, మహాలయ అమావాస్య రోజుల్లో వేలాది మంది భక్తులు వచ్చి, సముద్రతీరం, ఆలయ ప్రాంగణంలోని తీర్థబావులు, కొలనుల్లో స్నానమాచరించి, పితృదేవతలకు తర్పణాలు వదిలుతుంటారు. చిత్తిరై అమావాస్య సందర్భంగా రామనాథస్వామివారి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకే పూజలు ప్రారంభించిన శివాచార్యులు, ఉదయం 5 గంటలకు స్ఫటికలింగ పూజ, 6 గంటలకు సాయరక్ష, ఉదయ కాల పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా రామనాథపురం సమీపంలో వున్న సేతుకరై సముద్రం, దేవీ పట్టణం, నవపాశాన సముద్రతీరాల్లో వందలాది మంది భక్తులు ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. ఇదిలా వుండగా, రామేశ్వరం ఆలయ సమీపంలోని తూర్పువీధిలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పగిలి మురుగునీరు రోడ్డుపై పారడంతో దుర్వాసన భరించలేక భక్తులు ఇబ్బందుల పాలైయ్యారు.



తూర్పువీధిలో గుమిగూడిన భక్తులు